# దేవునిపై ప్రమాణము చేసి...

సాయంత్రం అయిదున్నర ప్రాంతంలో ఆఫీసు నుంచి తిరిగివస్తూ దారిలో జడ్జి కోర్టు ఎదుట పెద్దఎత్తున దెబ్బలాట జరుగుతుంటే - ఏమిటో చూద్దామని ఆగాను.

ఒక భారీమనిషి చుట్టూ పదిమంది చేరి రాయడానికి అవకాశంలేని - రాసినా ఎవరూ లచ్చు వెయ్యని- " శుద్ధ సంస్కృతం " లో నానా తిట్లూ తిడుతున్నారు.

భారీ మనిషికి దాదాపు యాభైయేళ్లుంటాయి. పెద్ద పెద్ద మీసాలున్నాయి పంచెకట్టుకున్నాడు. ముతకచొక్కా తొడుక్కుని వున్నాడు. కాళ్ళకు టైరుజోడు వేసుకున్నాడు. పదిమందిని సునాయాసంగా మన్ను కరిపించగలిగినంత బలంగా ఆరోగ్యంగా ఉన్నాడు.

కాని, ఎందుకనో ఆ తిట్లన్నీ భరిస్తూ తనలో తనే ఏదేదో గొణుక్కున్నాడు. భారీ మనిషి (భా.మ.)

భా.మ. ప్రక్కనున్న అతని మద్దతుదారు కోపంతో రెచ్చిపోయి. " ఏం-తంతావా తన్ను చూద్దాం ఏమాత్రం తంతావో - వొంటిమీద చెయ్యిపడిందో తలకాయ ఎగిరిపడిపోతాది ఏమనుకుంటన్నావో ఆ ( " - అని రొప్పడం మొదలుపెట్టాడు.

" చాల్లాల్లే - నోరుముయ్యరా- దొంగ సాచ్చికాలు చెప్పే నాకొడుకులు పెద్ద పౌరుషం కబుర్లు చెబుతున్నారు. అట్టే వాగితే తంతామా, తన్ని చూపిస్తామా" అన్నాడు ఎదుట మనిషి.

ఇంతలో సూర్యారావూ, చిదంబరమూ వచ్చి నాపక్కన నిలబడ్డారు. ముగ్గురం కొంచెం దూరంగా నిలబడి తగువుచూస్తున్నాం. సూర్యారావు అసలే ఒంటి పేగుమనిషి.

నిజంవెల్లడించవలసిన మనిషి, అవతలి పక్షం దగ్గిర డబ్బుకతికి, దొంగ సాక్ష్యం చెప్పాడు. ఆ సాక్ష్యం పైనే కేసంతా ఆధార పడి వుంది. ఇవ్వాళ చెప్పిన దొంగ సాక్ష్యంవల్ల ఏ నేరమూ చెయ్యని అమాయకుల మీద నేరం బలపడింది. శిక్షదాదాపు ఖాయం.

ఇంతకూ జరిగిన కథ ఏమిటంటే ఇక పల్లెటూర్లోని పోరంబోకు భూమిలో వున్న ఆరు చింతచెట్లు రైతులు కొట్టేశారు. ఆ చెట్లపై అధికారంగల ఆఫీసర్లతో రైతులు ముందుగానే కుమ్మక్కయ్యారు. చెట్లు అమ్ముకోగా వచ్చిన సొమ్ములో సగం ఆఫీసర్లకు ముట్టజెప్పాలి, కాని రైతులు ముట్టజెప్పలేదు. దాంతో ఆ ఆఫీసరు జీపుమీద ఆ గ్రామానికివచ్చి, రైతుల్ని నానాతిట్లూ తిట్టాడు. రైతులు తన్నబోయారు కాని- బాగా తిట్టి, బెదిరించారు. ఇంతలో ఒక పద్దమనిషి అడ్డుపడి, తగువు ముదరకుండా సర్దుబాటు చేశాడు. ఆ పెద్దమనిషి ప్రస్తుతం అలా చేశాడు గాని, లోగడ చాలాసార్లు ఆఫీసరుతో ఘర్షణపడినవాడే. అంచేతతనిమీద ఆఫీసరుకు గుర్రుగావుంది.పైకి తనని కాపాడినట్టు నటించినా, రైతుల్ని తనమీదకి పురికొల్పినవాడు అతనే అని ఆఫీసరుకు గట్టి అనుమానం. దాంతో ఆ ఆఫీసరు తిన్నగా పట్నంవచ్చి, ఫలానా గ్రామానికి డ్యూటీమీద వెళ్ళగా ఫలానా ఫలానా పేర్లుగల రైతులు తనని కొట్టారనీ, హత్యాప్రయత్నం కూడా చేశారనీ, చంపుతామని బెదిరించారనీ పోలిసు రిపోర్టు యిచ్చి, ఆ పెద్దమనిషినీ, మరో

అరడజనుమందినీ కొట్లో వేయించేశాడు. అరడజనుమందీ కొట్లో పడ్డారుగాని, ఎవరికీ కనపడకుండా ఒక లాడ్జిలో పడుకున్నాడు. మర్నాడు కొందరు పలుకుబడిగలవాళ్ళు వచ్చి వాళ్ళని బెయిలుమీద విడిపించారు. బయటికి వచ్చిన ఆ రైతులు రెచ్చిపోయి ఆ ఆఫీసర్ని నిజంగానే చంపేస్తామని కత్తులూ, కఠార్లూ పట్టుకుని బయలుదేరారు. దాంతో బెదిరిపోయి మెడికల్‌లీవు పెట్టేసి, ఆ ఆఫీసరు రాత్రిరాత్రే స్వంతజిల్లాకు ప్రయాణం కట్టాడు.

కేసు మరింత జటిలమయిపోయింది. పోలీసులు అయోమయంలో పడిపోయారు. ఈ సంగతుల్ని సేకరించి. మేం ముగ్గురం మాలో మేం మాట్లాడుకుంటున్నాం.

తగువు ముదిరిపోయింది. చేతి కర్రలులేచాయి. కొట్టుకోవడం ప్రారంభించారు. భారీ మనిషి మొదట్లో సినిమా వాడిలా విజృంభించాడు గాని - త్వరలోనే ఓడిపోయి చిత్తుగా తన్నులు తినేశాడు. నేలమీద పడిపోయాడు. వళ్ళంతా రక్తం కారుతోంది.

ఇదంతా క్షణాల్లో జరిగిపోయింది. ఆ రక్తం చూసి సూర్యారావు ముందే వొణికి పోయాడు. దీపాలు పెట్టేరు. ఆ భారీ మనిషిని ఆటో మీద వేసి ఆస్పత్రికి తీసుకుపోయారు.

"దేవునిపై ప్రయాణం చేసి అంతా నిజమే చెబుతాను. అబద్ధం చెప్పను. "అని భగవద్గీత మీద (లేదా మరో పవిత్ర పురాణ (గ్రంథం మీద) ప్రమాణం చేయిస్తారు. ముద్దాయిల చేత సాక్షులచేత, ఫిర్యాదీదారుచేత కూడానూ, జగన్నాధరావని మా కో-లాయరు ఫ్రెండున్నాడు. అతనంటాడూ- "న్యాయస్థానానికి వచ్చాక చెప్పవలసింది నిజంకాదు. ఏ మాట ఎలా చెబితే కేసు గెలుస్తుందో ఆ మాట అలాగే చెబుతారట, చెప్పాలి కూడనట. అది అందరికీ తెలిసిన న్యాయస్థానాల బహిరంగ సత్యమేనట.

ఆ తరువాత కథ - ఆ భారీ మనిషి తన మీద చెయ్యి చేసుకున్నట్టు నేరం మోపబడిన వారు ఆ సమయంలో ఆ స్థలంలో లేనట్టు "బలమైన సాక్ష్యాధారాల వల్ల కోర్టువారు నమ్మడం"చేత కేసు కొట్టివేయబడింది. భా.మ.కి మతిపోయింది. కోర్టు బయటికి వచ్చి పిచ్చిగా కేకలు పెట్టాడు. పోలీసుల్నీ, ప్లీడర్లనీ, జడ్జీలను - మొత్తం న్యాయవ్యవస్థనూ బండబూతులు తిట్టాడు. మామూలుగా ఆఫీసు నుంచి వస్తూ ఆ కేకలు నేనూ విన్నాను. చల్లపడ్డాక భా.మ. ఇలా అన్నాడు.

"నాయన్లారా, బాబుల్లారా ఆలకించడాలకించండి. దేవుడి యెదట ప్రమాణం చేసి అంతా నిజమే చెబుతున్నాను. అబద్ధం చెప్పడం లేదు. యెక్కడయినా న్యాయం వుండొచ్చు. ఎక్కడయినా నిజం వుండొచ్చు. మరెక్కడయినా ధరమం వుండొచ్చు. కాని - ఇదిగో - ఇలాటి కోర్టుట్లంటా, పోలీసు టేషన్లంటా ఇంకా జెయిళ్లంట - అస్సలు ఆవగింజలో అరవయ్యో వంతు కూడా న్యాయం వుండదుగాక వుండదు.

మరోమాట కూడా చెబుతానాలకించండి బాబయ్యల్లారా. పల్లెటూరు మన భాగ్యసీమరా, పాడిపంటలకు పట్టుగొమ్మరా - అని యెనకటి కొక మహానుభావుడు ఒక సినీమాలో పాట కట్టినాడు. కాని నేను పల్లెటూరోణ్ణే. నా మాట నమ్మండి. పల్లెటూళ్ళల్లో ఉన్నంత అక్రమం, అజ్ఞానం, కుళ్ళు, రాజకీయం, కక్షకుట్ర, కులతత్వం, దగా ఈ పట్నాలంట కూడ అంతగా వుండకపోవచ్చునండి. నామనసుకలాగ అనిపిస్తంది. ఈ పొలంలో నీళ్ళు ఆ పొలంలోకి పారితే తగువు. నా చెట్టుమీద నువ్వు చెయ్యేస్తే తగువు.

నీ చెట్టు నేను ముట్టుకుంటే తగువు. నీ పొలంలోంచి నేను నడిస్తే తగువు. నా పొలంలో నువ్వు నడిస్తే తగువు, పైకి శానా కబుర్లు చెబుతారు గాని శాంతం అస్సలుండదు. పంతాలకూ పౌరుషాలకూ లోటు లేదు. పట్నంల అలాక్కాదు. నీ పక్కింటోడేడి చేసినా నీకక్కర్లేదు. అదేకులమయినా ఫరవాలేదు, పల్లెటూళ్లెంట ప్రతీదీ ఆరా, చిన్న తగువయితే శాన కొట్టీసుకోడమే. కోడి కుర్రమందంటే శాన తెల్లారీసరికి పోలీసు టేషన్లకీ, లాయర్లకాడికీ పారొస్తారు, పొలాలయినా తెగనమ్మీసు కుంటారు గాని పంతం మానరు. నా కంటికి ఈ పట్నమే కాసింత బాగా అవుపిస్తంది. అయితే నా చిన్నప్పుడు పల్లెటూళ్లు ఒకరంగ భాగ్యసీమలే ఈ కద్దరు రాజకీయనాయకులూ, పంచాయితీలూ, సమితులూ, సర్పంచులూ - అనుకుంటా ఈ గొడవలల్ల పెట్టి కంపుచేయిస్సేరు. ఊరికే పట్నాలంట తెగతయ్యారైపోతన్న లాయర్లు కొంతపాడుచేయిస్సేరు. ఆ మీద మమ్మల్ని వరిపండించుకోనీకుంట - మిర్చియెయ్యి, పొగాకెయ్యి, చెఱుకెయ్యి అని వొడ్డీ యాపారస్తులూ, పొలంమీద పచ్చిపంటకి ఎంతోకంత సొమ్ముపారీసి కొనీసి మమ్మల్నిముంచేసే షావుకార్లూ, మిగతాపని పూర్తిచేయిస్సి పల్లెటూళ్లని బగ్గుమనిపించేశారు. మరందుచేత పల్లెటూళ్లు భాగ్యసీమలు కావు.

సచ్చింజెబుతున్నాను. దేముడి యెదుట ప్రయాణం చేసి 'అంతా నిజిమే చెబుతన్నాను. ఒక్క అచ్చరం కూడా అబద్ధం చెప్పటం లేదు......"

-ఇలా సాగుతుందతని వాగుడు...

అతనికి పిచ్చెంత్తిందని కొందరన్నారు.

అతనికి యిప్పుడే జ్ఞానోదయం అయ్యిందని మా సత్యం అన్నాడు.

ఇవ్వాళే - చిదంబరం తాను విన్న కబురు నాకు చెప్పాడు. ఆ మధ్య చెట్లు తగువులో ఇరుక్కున్న ఆఫీసరు గారికి ప్రమోషనొచ్చింది. అసలు తగువుతో ఎంతమాత్రం సంబంధంలేని ముగ్గురికి - (న్యాయాన్ని బలపరిచారు గనుక) రెండేసి సంవత్సరాలు కఠిన శిక్షలు పడ్డాయట.

మా ఆఫీసులో ఒక పొట్టి గుమాస్తా ఉన్నాడు. అతన్ని అంతా మాయశర్మ అంటారు. (పూర్తి పేరు మామిడికుదురు యజ్ఞనారాయణ అనుకుంటాను - లేక ఇంచుమించు అలాంటి పేరే) ఎప్పుడూ కుంకుమ బొట్టూ, చెవిన పువ్వూ, మెడలో రుద్రాక్షతావళం, కుడిచేతికి కాశీతాడూ, ఉంటాయి. మళ్ళీ డ్రస్సు మాత్రం చాలా సరికొత్త ఫాషనువే వేస్తుంటాడు. నాకు సంబంధించిన ఒక ముఖ్యమయిన కాయితం పారేశాడు. ఇప్పుడు మళ్ళీ కొత్తగా పెట్టడానికి కూడా పనికిరాదు. అందువల్ల నేను అయిదు వందలు నష్టపోయాను. నేను తీరా పై ఆఫీసరుతో కంప్లయింటు చేసినా, నువ్వసలు కాయితమే పెట్టలేదంటారు. అదీ తంటా. నావల్ల మామూళ్ళు ముట్టవని మాయశర్మే దాచేసి ఉంటాడు. లేదా పారేసివుంటాడు. ఇవ్వాళ్ళ గట్టిగా అడిగితే - "దేవుడిమీద ప్రమాణంచేసి నిజం చెబుతున్నాను. నాకు మీ కాయితం సంగతి తెలియనే తెలియదు. ఒట్టు సుమండి" అన్నాడు ! దేవుడివల్ల ఉపయోగంలేదని బుద్ధి తక్కువ వాళ్ళెవరో అంటారు గాని, ఒక వర్గానికి దేవుడు ఎంత బాగా ఉపయోగపడుతున్నాడో !

*రచన : నవంబరు 1984*

*ప్రచురణ : పల్లకి వారపత్రిక, జనవరి 31 1985*